క్లుప్తంగా

రైతులకు అవగాహన సదస్సు



మాట్లాడుతున్న ఏఈవో గౌసియా బేగం

పెంచికల్‌పేట్: మండలంలోని బొంబాయి గూడ, పోతెపల్లి గ్రామాల్లో వ్యవసాయ విస్తరణ అధికారి గౌసియాబేగం రైతులకు ఆయిల్ పాం, జీలుగు విత్తనాల సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ గురించి రైతులకు వివరించారు. గ్రామాల్లో నకిలీ విత్తనాలు విక్రయిస్తే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

మహిళలకు అండగా షీటీం



అవగాహన కల్పిస్తున్న షీటీం సిబ్బంది

ఆసిఫాబాద్‌రూరల్: మహిళలకు షీటీం అండగా ఉంటుందని షీటీం సభ్యురాలు సునీత అన్నారు. సోమవారం మండలంలోని రహపల్లి గ్రామంలో మహిళలకు షీటీం అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ మహిళలపై గృహ హింస, లైంగికదాడి, వేధింపులు, ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైమ్‌లకు గురిచేస్తే వెంటనే 100, 1930 నంబర్లకు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో షీటీం సభ్యులు స్వప్న, శ్రీలత, గ్రామస్తులు పాల్గొన్నారు.

వంతెన పనులు పరిశీలించిన ఎమ్మెల్యే



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోనప్ప

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని పెద్దవాగు వంతెన నిర్మాణ పనులను సోమవారం ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. వర్షాకాలంలోపు పనులు పూర్తి చేసి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. పనులు వేగవంతంగా పూర్తి చేసేందుకు పనిచేసే సిబ్బంది సంఖ్యను పెంచాలని సూచించారు.

'కేంద్ర ప్రభుత్వ నిధులతోనే అభివృద్ధి'



మాట్లాడుతున్న పాల్వాయి హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌రూరల్: గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ నిధులతోనే అభివృద్ధి పనులు జరుగుతున్నాయని బీజేపీ నాయకుడు పాల్వాయి హరీశ్ బాబు అన్నారు. పల్లెపల్లెకు పాల్వాయి –గడప గడపకు బీజేపీ కార్యక్రమంలో భాగంగా సోమవారం అనుకోడ, నాయికపు అనుకోడ, గన్నారం గ్రామాల్లో పాదయాత్ర చేపట్టారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకురావడంలో స్థానిక నాయకులు విఫలమయ్యారన్నారు. బీజేపీ నాయకులు కుందారపు సుమన్, తిరుపతి, గోవింద్, అశుతోష్ మండల్, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటు పనులు పరిశీలించిన ఎమ్మెల్యే సతీమణి



పనులు పరిశీలిస్తున్న కోనేరు రమాదేవి

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని నాగమ్మ చెరువులో ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సొంత డబ్బులతో నూతనంగా ఏర్పాటు చేస్తున్న గౌతమ బుద్ధుడి విగ్రహ ఏర్పాటు పనులను సోమవారం ఎమ్మెల్యే సతీమణి కోనేరు రమాదేవి పరిశీలించారు. జూన్ 4న విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఉండటంతో పనులను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సూచించారు. ఆమె వెంట నాయకులు ఇఫాత్‌హుస్సేన్, షెండె లాలాజి తదితరులు ఉన్నారు.

ఇంటింటా సీపీఐ పాదయాత్ర

బెల్లంపల్లి: మున్సిపాలిటీలో సోమవారం భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) ఆధ్వర్యంలో ఇంటింటా పాదయాత్ర సాగింది. ఆ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ కార్యదర్శి చంద్రశేఖర్ మున్సిపాలిటీలోని పదో వార్డు పెద్దనపల్లి బస్తీ, కొత్త గుడిసెలలో పాదయాత్ర చేశారు.

ఒకేచోట ఆరు ప్రకృతి వనాలు



రోంపెల్లి గ్రామంలో పక్కపక్కనే ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనాలు

- బోర్డులు ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్న అధికారులు
- ఆయా గ్రామాలకు దూరంగా వనాలు
- సౌకర్యాలు కరువు, కానరాని కంచెలు

తిర్యాణి: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఆహ్లాదం పంచాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అన్ని గ్రామాల్లో పల్లెప్రకృతి వనాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. మండలంలోని 29 గ్రామపంచాయతీల పరిధిలోని 143 గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాలతో పాటు మండలంలోని ఉల్లిపిట్ట గ్రామపంచాయతీ శివారులో బృహత్‌వనం ఏర్పాటు చేసింది. కాని నిర్వహణ లేకపోవడం, సౌకర్యాలు కల్పించకపోవడంతో అవి పేరుకే పల్లె ప్రకృతి వనాలుగా మిగిలిపోయాయి.

అలంకారప్రాయంగా..

పల్లెప్రకృతి వనాల కోసం కేంద్ర నిధులతో పాటు గ్రామపంచాయతీ నిధులను వినియోగించుకొని వాటిని అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంది. కానీ క్షేత్రస్థాయిలో అనేక వనాల్లో కనీస సౌకర్యాలను కూడా అధికారులు కల్పించలేదు. మండలంలోని రోంపెల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ఆరు గ్రామాలకు రోంపెల్లి శివారులోని అటవీ ప్రాంతంలో పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేశారు. ఒక్కో వైపునకు ఒక్కో గ్రామం బోర్డు ఏర్పాటు చేసి నాలుగు గ్రామాలకు సంబంధించిన వనాలను ఒకే చోట ఏర్పాటు చేశారు. సమీపంలోనే మరో రెండు గ్రామాలకు చెందిన వనాలు ఏర్పాటు చేయగా వాటికి కనీసం గేటు, ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేయలేదు. కేవలం నేమ్ బోర్డులు పెట్టి చేతులు దులుపుకున్నారు. ఈ వనాలు ఆయా గ్రామాలకు 2 నుంచి 4 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో అటువైపు వెళ్లే వారు లేక అలంకార ప్రాయంగా మారాయి. వీటితో పాటు గుండాల గ్రామపంచాయతీ పరిధిలో సైతం ఇదే రీతిలో నాలుగు పల్లెప్రకృతి వనాలు ఏర్పాటు చేశారు.

నిర్వహణ కరువు..

మండలంలో పలు చోట్ల అన్ని సౌకర్యాలతో వనాల నిర్మాణం చేపట్టినా వాటి నిర్వహణపై అధి కారులు దృష్టి సారించకపోవడంతో నాటిన మొక్కలు సైతం ఎండిపోతున్నాయి. మండలంలో ఏర్పా టు చేసిన బృహత్‌వనానికి సైతం నేటికీ గేటు, ఫెన్సింగ్ ఏర్పాటు చేయలేదు. దీంతో బృహత్‌వనం పశువులకు అడ్డాగా మారింది. క్షేత్రస్థాయిలో అధికారులు పల్లె ప్రకృతి వనాల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని మండలవాసులు డిమాండ్ చేస్తున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు



మండలంలోని పల్లె ప్రకృతి వనాల అభివృద్ధిపై అధికారులు దృష్టి సారించడం లేదు. దీంతో అవి నిరుపయోగంగా మారాయి. ప్రతీ పల్లె ప్రకృతి వనానికి కంచె, గేటు ఏర్పాటు చేసి పూలు, పండ్ల మొక్కలు నాటి వాటి అభివృద్ధికి అధికారులు కృషి చేయాలి. – భాస్కర్, ఆదివాసీ సంఘం నాయకుడు, తిర్యాణి

పోచమ్మ ఆలయానికి నిధుల మంజూరుకు కృషి

- కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవ్‌రావు

ఆసిఫాబాద్‌అర్బన్: వాంకిడి మండల కేంద్రంలో నాలుగు వరుసల రహదారి నిర్మాణంలో నష్టపోయిన పోచమ్మ దేవాలయాన్ని నూతనంగా నిర్మించేందుకు అవసరమైన నిధులు మంజూరుకు కృషి చేస్తానని కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవ్‌రావ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు రాజేశం, చాహత్ బాజ్‌పాయ్, ఆర్డీవో రాజేశ్వర్, జెడ్పీటీసీలు అరిగెల నాగేశ్వర్‌రావ్, అజయ్, దేవస్థాన కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ప్రజలు నాలుగు వరుసల రహదారి నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో సర్పంచ్ తుకారాం, సింగిల్ విండో చైర్మన్ పెంటయ్య, దేవస్థాన కమిటీ అధ్యక్షుడు మహజన్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహాల ప్రతిష్ఠాపన



జెండాగూడలో విగ్రహావిష్కరణ పూజలో ఎమ్మెల్యే



లోడుపల్లిలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కోనప్ప

దహెగాం: మండలంలోని ఒడ్డుగూడ, జెండాగూడ గ్రామాల్లో నూతనంగా నిర్మించిన భక్తాంజనేయ స్వామి ఆలయాల్లో సోమవారం విగ్రహావిష్కరణ పూజలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జెండాగూడలో వేద పండితులు శ్రీకాంత్, చంద్రశేఖర్‌లు, ఒడ్డుగూడలో పార్థివ శర్మ, మోహన్‌రావుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహాలను ప్రతిష్ఠించారు. సిర్పూర్(టి) ఎమ్మెల్యే కోనేరు కోనప్ప విగ్రహాల ప్రతిష్ఠాపన పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తాళ్లపల్లి రామారావు, నాయకులు గజ్జెల సురేశ్, సోను తదితరులు పాల్గొన్నారు.

లోడుపల్లిలో హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన

పెంచికల్‌పేట్: మండలంలోని లోడుపల్లి గ్రామంలో శ్రీ అరణ్య అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనను వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య కన్నుల పండువగా నిర్వహించారు. రెండు రోజులుగా ఆలయ ప్రాంగణంలో వేద పండితులు హోమం నిర్వహించి ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కోనేరు కోనప్ప–రమాదేవి దంపతులు, జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమి టీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

క్రీడా నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలి



క్రీడాకారులతో అధికారులు, సభ్యులు

రెబ్బెన: ప్రతీ క్రీడాకారుడు నిరంతర సాధనతో తమకు నచ్చిన క్రీడలో నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని బెల్లంపల్లి ఏరియా జీఎం దేవేందర్, రెబ్బెన ఎస్సై భూమేష్‌లు అన్నారు. జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గోలేటిలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి చెస్ పోటీలు సోమవారం ముగిశాయి. వారు మాట్లాడుతూ జిల్లాస్థాయి క్రీడా పోటీలు గోలేటిలో నిర్వహించడం సంతోషకరమన్నారు. జిల్లాస్థాయి క్రీడల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులకు అభినందలు తెలిపారు. ఓపెన్ టూ ఆల్ చెస్ పోటీల్లో 24 మంది క్రీడాకారులు బహుమతులు సాధించినట్లు అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు కోట సుధాకర్ తెలిపారు. పోటీల్లో ఓటమి చెందిన క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో వ్యవహరిస్తూ భవిష్యత్తు పోటీల్లో గెలుపు కోసం కృషి చేయాలన్నారు. అసోషియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంపత్‌కుమార్, సర్పంచ్ పోటు సుమలత, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రావు, ఉపాధ్యక్షుడు బోగే ఉపేందర్, జిల్లా కోశాధికారి మల్లేష్, సంయుక్త కార్యదర్శి సమ్మయ్య, తిరుపతి, నరేష్, కోచ్ కల్పన పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయంతో సతమతం

- జంబుగ సబ్‌స్టేషన్ పరిధిలో వినియోగదారుల ఇక్కట్లు



జంబుగ విద్యుత్ సబ్‌స్టేషన్

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని జంబుగ సబ్‌స్టేషన్ పరిధిలో చీటికిమాటికి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో వినియోగదారులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. జంబుగ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి మండలంలోని 15 గ్రామాలతో పాటు దహెగాం, పెంచికల్‌పేట్ మండలాలకు విద్యుత్ సరఫరా అవుతుంది. మండలాలకు వెళ్లే 33 కేవీలైన్‌కు మండలంలోని వివిధ గ్రామాలకు సరఫరా అయ్యే 11 కేవీలైన్ అతి సమీపంలో నుంచి ఉండటంతో ఎక్కడ ఏ సమస్య వచ్చినా సబ్‌స్టేషన్ నుంచి మొత్తం సరఫరా నిలిపివేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. గత ఏడాది పెంచికల్‌పేట్ మెయిన్ లైనులో సమస్య ఎదురైనప్పుడు జూనియర్ లైన్‌మెన్ శంకర్ విద్యుత్ లైన్‌లను చెక్ చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తూ రాస్పెల్లివద్ద 33 కేవీ లైను, 11 కేవీలైన్లు కలవడంతో విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందారు. అప్పటి నుంచి పెంచికల్‌పేట్, దహెగాం మెయిన్ లైన్లలో మరమ్మతులు చేపట్టినప్పుడల్లా జంబుగ విద్యుత్‌సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. దీంతో తరచుగా సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుంది.

అధికారుల నిర్లక్ష్యమేనా..?

జంబుగ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో తరుచుగా విద్యుత్ సరఫరాలో సమస్య ఎదురవుతోంది. నెలలో ఒక్కరోజు విద్యుత్ సరఫరా నిలిపివేసి నెలవారి మెయింటనెన్స్ మరమ్మతు పనులు చేపట్టాల్సి ఉంటుంది. కానీ ఈ సబ్‌స్టేషన్ పరిధిలో మాత్రం అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. 'ఏదైనా సమస్య వచ్చినప్పుడే చూసుకుందాం' అనే ధోరణిలో సిబ్బంది వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. విద్యుత్ స్తంభాలకు ఆనుకొని ఏపుగా చెట్లు పెరిగినా వాటిని తొలగించే పనులు చేపట్టడం లేదు. వర్షం కురిసినప్పుడు సమస్య ఎదురై రోజంతా విద్యుత్ సరఫరా నిలిపివేయాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. ముందు జాగ్రత్తగా అధికారులు మెయింటనెన్స్ పనులు చేపడితే విద్యుత్ అంతరాయ సమస్య ఉండదని స్థానికులు పేర్కొంటున్నారు.

సమస్య పరిష్కరించాలి

విద్యుత్ సరఫరాలో తరుచుగా అంతరాయం ఏర్పడుతుంది. దీంతో తీవ్ర ఇబ్బందికి గురవుతున్నాం. కరెంట్ ఎప్పుడు ఉంటుందో ఎప్పుడు పోతుందో తెలియడం లేదు. విద్యుత్ అధికారులకు ఫోన్లు చేసినా స్పందించడం లేదు. అధికారులు సమస్యను పరిష్కరించాలి.

– లావుడే సంతోశ్, వినియోగదారుడు

చర్యలు తీసుకుంటాం

విద్యుత్ సరఫరా సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకుంటాం. పెంచికల్‌పేట్, దహెగాం మెయిన్ లైన్‌లకు మరమ్మతులు చేసేటప్పుడు ప్రమాదం జరగకుండా మొత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నాం. విద్యుత్ స్తంభాలను ఆనుకుని ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తాం.

– శ్రీనివాస్, ఏడీఈ, కాగజ్‌నగర్

ప్రభుత్వ భూమిని పేదలకు పంపిణీ చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న సోమశేఖర్

రెబ్బెన: మండలంలోని నంబాల శివారు 309, 522, 278 సర్వే నంబర్లలో గల ప్రభుత్వ భూమిని పేదలకు పంపిణీ చేసి ఆదుకోవాలని నంబాల సర్పంచ్ చెన్న సోమశేఖర్ అన్నారు. ఈమేరకు కలెక్టరేట్‌లో సోమవారం ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవ్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ నంబాల పంచాయతీకి చెందిన నిరుపేదలు కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటూ జీవించారన్నారు. గతంలో సాగు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల నిరుపేదలకు మిగులు ప్రభుత్వ భూమిని తిరిగి పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. గ్రామానికి చెందిన మత్స్యకారులకు శాశ్వత ఇళ్లు లేకపోవటంతో ఇప్పటికి పూరి గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారని, 278సర్వే నంబర్‌లో గల ప్రభుత్వ భూమిలో మత్స్యకారులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. తీవ్ర ఎండల కారణంగా చేపలు మృతి చెంది తీవ్రంగా నష్టపోయిన మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, వార్డుసభ్యులు సంజీవ్‌కుమార్ జైస్వాల్ పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న సిబ్బంది

ఆసిఫాబాద్‌రూరల్/ఆసిఫాబాద్‌అర్బన్: కేజీబీవీల్లో పని చేస్తున్న సిబ్బందికి సమాన పనికి సమాన వేతనం అందించాలని డిమాండ్ చేస్తూ టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి మాట్లాడుతూ 2004లో కేజీబీవీలు ప్రా రంభించిన నుంచి మహిళా సిబ్బంది విద్యార్థినులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఎంతో కృషి చేశారన్నారు. వారు ఉద్యోగ భద్రత లేకుండా చాలీచా లని వేతనంతో ఇబ్బందులు పడుతున్నారని ఆరో పించారు. ఎస్‌వోలకు ప్రిన్సిపాళ్లుగా, పీజీసీఆర్టీలను జేఎల్స్‌గా, సీఈటీలను స్కూల్ అసిస్టెంట్స్‌గా, పీఈ టీలను పీడీలుగా గుర్తించి బేసిక్ పే అమలు చేయాలన్నారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందురావు, హేమంత్ షిండే, ఊశన్న, రమేశ్, సుభాష్, ధర్మయ్య, కేజీబీవీ సిబ్బంది రమాదేవి, స్నేహిత, హారిక, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో శానిటేషన్



ముత్తంపేటలో పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులు

- నేటితో ముగియనున్న పారిశుధ్య వారోత్సవాలు

కౌటాల: పల్లెల్లో పారిశుధ్య నిర్వహణ లోపంతో పల్లెవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో కాలనీల్లో దుర్వాసన వెదజల్లుతోంది. ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో పారిశుధ్య నిర్వహణ గాడిన పెట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాలను నిర్వహిస్తుంది.

నేటితో ముగియనున్న కార్యక్రమాలు

గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో పాటు ఆయా గ్రామాల్లో అధికారులకు ప్రత్యేక బాధ్యతలు సైతం అప్పగించింది. దీంతో గ్రామాల్లో పారిశుధ్య పనులు కొనసాగుతున్నాయి. రానున్న వానాకాలం లోపు మురికి కాలువల్లో చెత్తాచెదారం లేకుండా తగిన చర్యలు చేపడుతున్నారు. ఈ నెల 17 న ప్రారంభమైన కార్యక్రమం నేటితో ముగియనుంది.

చేపట్టిన పనులు..

ప్రభుత్వ ఆదేశాలతో గ్రామాల్లో వారం రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నెల 19న తాగునీటి ట్యాంకులు శుభ్రపర్చడంతో పాటు క్లోరినేషన్ పైపుల మరమ్మతులు చేపట్టారు. మురుగు నీరు నిల్వ ఉన్న ప్రదేశంలో ఆయిల్ బాల్స్ వేయడం, దోమల నివారణకు ఫాగింగ్, పారిశుధ్య లోపం ఉన్న ప్రదేశంలో బ్లీచింగ్ పౌడర్ చల్లడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈనెల 20న ప్రభుత్వ కార్యాలయాలను శుభ్రపర్చడంతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలు, గర్భిణులకు రాగి లడ్డులు పంపిణీ చేయడంతో పాటు ప్రభుత్వ కార్యాలయాల ఆవరణల్లో మొక్కలు నాటేందుకు ప్రణాళికలు తయారు చేశారు. శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించారు. ఈనెల 21న ప్రకృతి వనంలో చనిపోయిన మొక్కల స్థానంలో కొత్తవి నాటడం, నర్సరీలో కలుపు మొక్కలు తొలగించడం, హరితహారం కోసం గుంతలు తవ్వడం వంటి పనులు చేపట్టారు. ఈనెల 22న వైకుంఠధామం, డంపింగ్ యార్డులకు విద్యుత్తు, నీటి వసతి కల్పించడం, వీటితో పాటు మరమ్మతులు, పెయింటింగ్ పనులు చేయడం, డంపింగ్ యార్డుల ద్వారా పంచాయతీలకు ఆదాయం వచ్చేలా అవగాహన కల్పించారు.

నేటి కార్యక్రమాలు

నేడు గ్రామాల్లో హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటేందుకు స్థలాలు గుర్తించడం, పంచాయతీలోని ఆవాస గ్రామాలతో ఈజీఎస్ గ్రామసభ నిర్వహించి ప్రజల సమస్యలను సేకరించి మండల అధికారుల ద్వారా సంబంధిత అధికారులకు పంపించడం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి

నార్నూర్: పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎల్‌పీవో భిక్షపతిగౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని తాడిహత్నూర్ గ్రామంలో చేపడుతున్న పారిశుధ్య పనులను ఎంపీవో స్వప్నశీలతో కలిసి పరిశీలించారు. గ్రామాల్లో పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వచ్చేది వర్షకాలం కాబట్టి శానిటేషన్‌తో పాటు వర్షపు నీరు నిలువ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

గూడెంలో భారీగా దేశీదారు స్వాధీనం

చింతలమానెపల్లి: మండలంలోని గూడెం గ్రామంలో సోమవారం సాయంత్రం ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో గ్రామానికి చెందిన ఒక వ్యాపారి ఇంటిలో నిల్వ ఉంచి విక్రయిస్తున్న 15కాటన్ల దేశీదారు మద్యాన్ని ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మద్యాన్ని కాగజ్‌నగర్ ఎక్సైజ్ శాఖ కార్యాలయానికి తరలించారు. కాగజ్‌నగర్ ఎక్సైజ్ సీఐ విలాస్‌ను సంప్రదించగా తనిఖీల్లో దేశీదారు మద్యం లభించినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని, పూర్తి వివరాలు మంగళవారం తెలియజేస్తామని ఆయన పేర్కొన్నారు.

ప్రజా సంక్షేమమే సీఎం కేసీఆర్ ధ్యేయం

బెల్లంపల్లి: ప్రజాసంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ పని చేస్తున్నారని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. ఏఎంసీ ఏరియాలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో బెల్లంపల్లి మున్సిపల్, గ్రామీణ ప్రాంత కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులు 44మందికి ఎమ్మెల్యే చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిరుపేద ఆడ బిడ్డల పెళ్లికి చేదోడుగా ఉండాలనే ఉద్దేశంతో కల్యాణ లక్ష్మి పథకం సీఎం ప్రా రంభించారన్నారు. ఆడ బిడ్డలు బీఆర్ ఎస్ ప్రభుత్వానికి అండగా ఉండాల ని కోరారు. కార్యక్రమంలో మున్సిప ల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, వైస్ ఎంపీపీ రాణి, తహసీల్దార్ మధుసూదన్, మున్సిపల్ కౌన్సిలర్లు గెల్లి రాజలింగు, శ్రీనివాస్, రమేష్, కృష్ణ, అశోక్ గౌడ్, ఎంపీటీసీ సుభాష్‌రావు, సర్పంచ్‌లు కృష్ణమూర్తి, రంజిత, అశోక్, బీఆర్ఎస్ శ్రేణులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.